


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | మంగళవారం 12-1-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 138 | పేజీలు: 4 | వెల: రూ.1/-





# వ్యాక్సిన్ వేసుకున్న వారికి డిజిటల్ సర్టిఫికేట్ : మోదీ




న్యూఢిల్లీ, జనవరి 11: విశ్వసనీయ పద్ధతిలోనే కోవిడ్ టీకాలకు ఆమోదం ఇచ్చినట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. ఇవాళ పలువురు సీఎంలతో ఆయన వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఆ తర్వాత ఆయన మాట్లాడారు. భారత్‌లో రెండు టీకాలకు ఆమోదం దక్కిందని, అయితే ఆ టీకాలకు విశ్వసనీయ పద్ధతిలోనే ఆమోదం దక్కినట్లు ప్రధాని స్పష్టం చేశారు. ఆ రెండు టీకాలు శాస్త్రీయ సూత్రాలకు తగినట్లుగా ఉన్నాయని, ఇది గర్వకారణమైన విషయమని ఆయన తెలిపారు. ఆక్స్‌ఫర్డ్‌కు చెందిన కోవీషీల్డ్, భారత్ బయోటెక్‌కు చెందిన కోవాగ్జిన్ టీకాలను కేంద్రం ఆమోదించిన విషయం తెలిసిందే. అయితే యూనివర్సల్ ప్రోటోకాల్స్ ప్రకారమే శాస్త్రవేత్తల వర్గం ఆ రెండు టీకాలకు పచ్చజెండా ఊపినట్లు ప్రధాని తెలిపారు. షరుతుల అంశంలో సంతృప్తి వ్యక్తం అయిన తర్వాతనే ఆ టీకాలకు ఈయూఏ ఆమోదం దక్కిందన్నారు. ఒకవేళ రాష్ట్రాలే టీకాలను కొనుగోలు చేస్తే, అప్పుడు ధరల విషయంలో సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నట్లు ప్రధాని చెప్పారు. ఒకే ఒక్క ఏజెన్సీ బాధ్యత తీసుకుంటే ఉత్తమంగా ఉంటుందని, కేంద్ర ప్రభుత్వమే ఆ బాధ్యత తీసుకుంటే బెటర్ అన్న అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. మూడు కోట్ల మందికి వ్యాక్సిన్ ఇచ్చిన తర్వాత మరోసారి భేటీ నిర్వహించనున్నట్లు ప్రధాని తెలిపారు.

తొలి దశ ఫ్రంట్‌లైన్‌దే..

కోవిడ్ సంక్షోభం వేళ అందరం కలిసికట్టుగా పనిచేయడం సంతోషంగా ఉందని ప్రధాని తెలిపారు. చాలా సున్నితమైన అంశంలో అందరూ త్వరగా నిర్ణయాలు తీసుకున్నట్లు చెప్పారు. ఇతర దేశాల్లో వ్యాప్తి చెందినట్లుగా.. భారత్‌లో కోవిడ్ వ్యాప్తి చెందలేదన్నారు. ప్రైవేటు అయినా ప్రభుత్వం అయినా.. తొలి దశలో ఫ్రంట్‌లైన్ హెల్త్ వర్కర్లకు టీకాలు ఇవ్వనున్నట్లు ప్రధాని వెల్లడించారు. చాలా సరసమైన ధరల్లో రెండు వ్యాక్సిన్లు అందుబాటులో ఉంటాయన్నారు. ఒకవేళ విదేశీ టీకాలపై ఆధారపడి ఉంటే, దేశంలో పరిస్థితి మరోలా ఉండేదన్నారు.

డిజిటల్ సర్టిఫికేట్..

వ్యాక్సినేషన్ అంశంలో రియల్ టైమ్ డేటా చాలా కీలకమైందని ప్రధాని అన్నారు. టీకా తీసుకున్న వారందరికీ డిజిటల్ సర్టిఫికేట్ ఇవ్వనున్నట్లు చెప్పారు. డేటాను పొందుపరచడం వల్ల.. రెండవ డోసు విషయంలో అలర్ట్ చేస్తుందన్నారు. రెండవ దశలో 50 ఏళ్లు దాటిన వారికి, వ్యాధులు ఉన్న 50 ఏళ్ల లోపు వారికి టీకాలు ఇవ్వనున్నారు. రానున్న కొన్ని నెలల్లో సుమారు 30 మందికి టీకాలను ఇచ్చేందుకు ప్రణాళిక చేసినట్లు మోదీ తెలిపారు. అన్ని రాష్ట్రాలను కలిపితే మొత్తం మూడు కోట్ల మంది హెల్త్, ఫ్రంట్ లైన్ వర్కర్లు ఉన్నారని, అయితే వారికి అయ్యే టీకా ఖర్చులను కేంద్రమే భరిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలకు ఆ ఖర్చుతో సంబంధం లేదన్నారు.



ప్రగతి భవన్‌లో సోమవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్.

# తెలంగాణలో మోగనున్న బడిగంటలు

**ఫిబ్రవరి 1నుంచి విద్యాసంస్థల రీ ఓపెన్**

**9 ఆపై తరగతుల విద్యార్థులకు తరగతుల నిర్వహణ**

**కోవిడ్ నిబంధనలతో నడపాలని విద్యాశాఖకు ఆదేశాలు**

**ప్రగతి భవన్‌లో ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం నిర్ణయం**

హైదరాబాద్,జనవరి11(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో ఫిబ్రవరి 1 నుంచి విద్యాసంస్థలు పునః ప్రారంభం కానున్నాయి. 9వ తరగతి నుంచి ఆపై విద్యార్థులకు తరగతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని సీఎం కేసీఆర్ విద్యాశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. పలు కీలక అంశాలపై చర్చించేందుకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రగతి భవన్‌లో సోమవారం మంత్రులు, కలెక్టర్లు, పంచాయతీ రాజ్, రెవెన్యూ, మున్సిపల్, వైద్యారోగ్య, విద్యాశాఖ, మున్సిపల్ శాఖ, అటవీశాఖ అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా విద్యాసంస్థల ప్రారంభంపై ఆ శాఖ అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. కొవిడ్ నిబంధనలకు అనుగుణంగా జాగ్రత్తలు పాటిస్తూ విద్యాసంస్థల నిర్వహణ సాధ్యమేనని అధికారులు వెల్లడించడంతో సీఎం విద్యాసంస్థల పునః ప్రారంభానికి పచ్చజెండా ఊపినట్లు తెలిసింది. దీంతో 10 నెలలుగా మూతబడిన పాఠశాలలు మరో 20 రోజుల్లో తిరిగి తెరుచుకోనున్నాయి. ఇకపోతే ఉద్యోగ ఖాళీలన్నింటినీ ఒకేసారి వెంటనే భర్తీ చేసేందుకు సీఎం కేసీఆర్ ఉన్నతాధికారులను ఆదేశించారు. రెవెన్యూకు సంబంధించి అన్నిరకాల సమస్యలు సత్వరం పరిష్కరించాలని, ధరణి పోర్టల్‌లో అవసరమైన అన్నిరకాల మార్పులు చేర్పులు వారంరోజుల్లోగా పూర్తి చేయాలని సూచించారు. కరోనా టీకా పంపిణీకి వెంటనే ఏర్పాట్లు పూర్తిచేయాలని వైద్యారోగ్యశాఖ అధికారులకు చెప్పారు. అడవుల పునరుద్ధరణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వైకుంఠధామాల నిర్మాణాలు పూర్తిచేసి వెంటనే అందుబాటులోకి తేవాలని పేర్కొన్నారు. అన్ని పట్టణాల్లో జనాభాకు అనుగుణంగా సమీకృత మార్కెట్లు నిర్మించాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో అర్హులకు వెంటనే పదోన్నతులు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని సీఎం ఆయాశాఖల ఉన్నతాధికారులను ఆదేశించారు.

# తెలంగాణలో భారీ పెట్టుబడులకు మాస్ మ్యూచువల్ సంసిద్ధత

**అమెరికా వెలుపల వేయికోట్ల పెట్టుబడికి ముందుకొచ్చిన సంస్థ**

హైదరాబాద్,జనవరి11(ఆర్ఎన్ఎ): అమెరికాకు చెందిన ప్రముఖ ఇన్సూరెన్స్ దిగ్గజం మాస్ మ్యూచువల్ సంస్థ తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. సుమారు రూ.వెయ్యి కోట్ల పెట్టుబడితో హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆ సంస్థ సోమవారం ప్రకటించింది. యూఎస్ వెలుపల తొలిసారి రూ.వెయ్యికోట్ల పెట్టుబడితో ఏర్పాటు కానున్న సెంటర్‌గా ఇది నిలవనుంది. మాస్ మ్యూచువల్ హైదరాబాద్ రాక పట్ల పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో ఒకటైన ప్రముఖ బీఎఫ్ఎస్ఐ కంపెనీ మాస్ మ్యూచువల్ విస్తరణలో భాగంగా హైదరాబాద్‌ను ఎంపిక చేసుకోవడం రాష్ట్రానికి గర్వకారణవ న్నారు. ఇలా తెలంగాణకు పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన అమెజాన్, గూగుల్, ఫేస్‌బుక్, ఆపిల్, ఫియట్ క్రిస్లర్ సంస్థలు పెట్టుబడులు పెడుతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ కంపెనీల సరసన తాజాగా ఈ అంతర్జాతీయ కంపెనీ చేరింది. తాజాగా హైదరాబాద్‌లో మరో అంతర్జాతీయ సంస్థ భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. నగరంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు మాస్ మ్యూచువల్ సంస్థ ప్రకటించింది. ఈ సందర్భంగా కేటీఆర్ ట్వీట్ చేశారు. ఈ వారానికి ఇంతకు మించిన శుభారంభం ఏముంటుంది? టాప్ ఫార్చ్యున్ 500 కంపెనీల్లో ఒకటైన మాస్ మ్యూచువల్‌ను రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆహ్వానించడం చాలా సంతోషంగా ఉందని మంత్రి కేటీఆర్ అన్నారు.

# కేంద్రప్రభుత్వానికి సుప్రీం షాక్

**ఆందోళన చేస్తున్న రైతులకు భారీ ఊరట**

**వ్యవసాయ చట్టాలను నిలుపుదల చేస్తారా..చేయమంటారా?**

**రైతులతో చర్చల్లో చిత్తశుద్ధి కానరావడం లేదు**

**వ్యవసాయ చట్టాలపై ఫిర్యాదుల్లో ఒక్కటీ అనుకూలంగా లేదు**

**రైతుల ఆందోళనలో అపశృతులు కనిపిస్తున్నాయి**

**చట్టాల పరిశీలనకు ఒక నిపుణుల కమిటీ ఏర్పాటు**

**చీఫ్ జస్టిస్ బోబ్డే నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్య**

న్యూఢిల్లీ,జనవరి11(ఆర్ఎన్ఎ): కొత్త వ్యవసాయ చట్టాలపై మొండిగా వాదిస్తున్న కేంద్రానికి సుప్రీంలో భారీ ఎదురు దెబ్బ తగిలింది. చట్టాలను తాత్కాలికంగా నిలిపివేయాలని సుప్రీం దర్మాసనం సూచించింది. దీంతో వ్యవసాయ చట్టాల రద్దుకోసం సుదీర్ఘం ఉద్యమం చేస్తున్న రైతులు, రైతు సంఘాలకు భారీ ఊరట లభించినట్లు అయ్యింది. మూడు వ్యవసాయ చట్టాలు, రైతుల ఆందోళనపై దాఖలైన పిటీషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు సోమవారం సంచలన వ్యాఖ్యలు చేసింది. కొంతకాలం చట్టాల అమలును నిలిపి వేయాలని లేదంటే తామే స్టే విధిస్తామని అత్యున్నత న్యాయస్థానం తెగేసి చెప్పింది. అలాగే ఈ చట్టాల పరిశీలనకు ఒక నిపుణుల కమిటీ ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించింది. అలాగే రైతులు తమ నిరసనను కొనసాగించుకో వచ్చని కూడా ధర్మాసనం స్పష్టం చేసింది..ప్రభుత్వం దీనిని ప్రతిష్టాత్మక సమస్యగా ఎందుకు చూస్తోందని ప్రశ్నించిన సుప్రీంకోర్టుప్రధాన న్యాయమూర్తి శరద్ అరవింద్ బాబ్డే వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా కేంద్ర వైఖరిపై అసంతృప్తితో ఉన్నామన్నారు. రైతుల ఆందోళన, సమస్యను పరిష్కరించడలంలో కేంద్రం సరిగా వ్యవహరించలేదని అభిప్రాయపడ్డారు. పలుదఫాలు చర్చలు విఫలంపై స్పందిస్తూ కేంద్రం పరిస్థితిని సరిగ్గా నిర్వహిస్తోందని, చర్చలు ప్రభావవంతంగా ఉన్నాయని తాము విశ్వసించడలేదంటూ ఘాటుగా స్పందించారు. అందుకే చట్టాల అమలును నిలిపివేయడం ద్వారా వాతావరణాన్ని అనుకూలంగా మార్చడానికి తాము ప్రయత్నిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. రైతు సంఘాలతో ప్రభుత్వ చర్చల్లో కొనసాగుతున్న ప్రతిష్టంభన మధ్య సీజేఐ వ్యాఖ్యలు ప్రాధన్యతను సంతరించుకున్నాయి. కొంతమంది రైతులు ఆత్మహత్యలను ప్రస్తావించిన సుప్రీంకోర్టు, వీటిపై ఆందోళన వ్యక్తం చేసింది. వీటన్నింటికీ ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆగ్రహం వ్యక్తం చేసింది. అంతేకాదు అసలు ఈ వ్యవహారంలో ఏం జరుగుతోందని కూడా ప్రశ్నించింది. ఏదైనా తప్పు జరిగితే మనలో ప్రతి ఒక్కరమూ బాధ్యత వహించాలి. ఇకపై ఎవరి రక్తంతోనూ మన చేతులు తడవకూడదని ఆయన పేర్కొన్నారు. ఈ మూడు చట్టాల పరిశీనలకుగాను ఐసీఎఆర్‌తో సహా నిపుణులతో కూడిన కమిటీని ఏర్పాటు చేస్తామని చెప్పారు. దీనిపై వ్యతిరేక, అనుకూల వాదనలను ఈ కమిటీకి అందించుకోవచ్చని , కమిటీ నివేదిక మేరకు తాము వ్యవహరిస్తామని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. కాగా కేంద్రం తీసుకొచ్చిన కొత్త చట్టాలకు కేవలం 2-3 రాష్ట్రాలు మాత్రవే నిరసన తెలుపుతున్నాయని అటార్నీ జనరల్ మెహతా సుప్రీంకు తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల రైతులు, ఇతర ప్రాంతాల రైతులు నిరసనల్లో పాల్గొనడం లేదన్నారు. అయితే కేంద్రం తీసుకొచ్చిన నూతన వ్యవసాయ చట్టాలపై రోజురోజుకీ పోరాటాలు ఉధృతమవుతున్న నేపథ్యంలో సుప్రీం కోర్టు సోమవారం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. నూతన చట్టాలను మీరు నిలుపుదల చేస్తారా? లేదంటే మమ్మల్ని చేయమంటారా? ఇందులో అహం ఎందుకు? ఏదైనా తప్పు జరిగితే మనలో ప్రతి ఒక్కరమూ బాధ్యత వహించాలి. మా చేతులకు రక్తం అంటుకోవాలని మేం భావించడం లేదని తెలిపింది. ఆందోళనల్లో పాల్గొన్న కొంత మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. మహిళలు, వృద్ధులు కూడా పాల్గొం టున్నారు. అసలు ఏం జరుగుతోందని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బోబ్డే నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. రైతుల ఆందోళన విషయంలో కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. చట్టాలను రద్దు చేయమని తాము అనడం లేదని, సమస్యకు పరిష్కారం కనుగొనడమే తమ లక్ష్యమని సుప్రీం స్పష్టం చేసింది. అయితే చట్టాల్ని కొంత కాలం నిలిపేయగలరా? అని కేంద్రాన్ని సుప్రీం ప్రశ్నించింది. రైతుల ఆందోళనలను కేంద్ర ప్రభుత్వం సరిగ్గా హ్యాండిల్ చేయలేకపోయిందని, అందుకే తామే ఓ నిర్ణయం తీసుకుంటామని జస్టిస్ బోబ్డే స్పష్టం చేశారు. కొత్త వ్యవసాయ చట్టాల అమలును మీరు నిలిపేస్తారా లేక మమ్మల్ని ఆ పని చేయమంటారా అంటూ ప్రశ్నించింది. ఒక్క పిటిషన్ కూడా ఈ చట్టాలు లబ్ది చేకూర్చుతాయని చెప్పలేదని ఈ సందర్భంగా ధర్మాసనం స్పష్టం చేసింది. విచారణలో భాగంగా చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా బోబ్డే కేంద్రం తీరుపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. మేము ఏవో విచ్చలవిడి వ్యాఖ్యలు చేయదలచుకోలేదు కానీ కేంద్ర ప్రభుత్వంపై చాలా అసంతృప్తిగా ఉంది. ఏం సంప్రదింపుల ప్రక్రియ కొనసాగుతుందో మాకు తెలియదు. అసలు ఏం జరుగుతోందో దయచేసి చెబుతారా అంటూ బోబ్డే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమస్యకు స్నేహపూర్వక పరిష్కారం చూపాలన్నదే మా ఉద్దేశం. కానీ ఈ చట్టాల అమలు నిలిపివేతపై ఎందుకు మాట్లాడటం లేదు. ఒకవేళ కేంద్రం చట్టాల అమలు నిలిపివేస్తే రైతులను చర్చలకు రావాల్సిందిగా మేము చెబుతాం. మీరైనా ఆ పని చేయండి లేదంటే కోర్టే చేస్తుంది అని బోబ్డే స్పష్టం చేశారు. ఇప్పటికే ఎన్నో ఆత్మహత్యలు, మరణాలు సంభవించాయని, పిల్లలు, మహిళలను రక్షించాల్సిన అవసరం ఉన్నదని ఆయన అభిప్రాయ పడ్డారు. రైతులు ఆందోళన నిర్వహించే స్థలాన్ని మరో చోటికి మార్చాలని కోర్టు ప్రతిపాదించింది. అయితే చట్టాల అమలు నిలిపివేత మాత్రం కుదరదని అటార్నీ జనరల్ కోర్టుకు స్పష్టం చేయడం గమనార్హం.

# బోయినపల్లి కిడ్నాప్ కేసులో అఖిలప్రియకు కస్టడీ

**మూడు రోజులపాటు పోలీస్ కస్టడీకి కోర్టు అనుమతి**

**బెయిల్ ఇవ్వాలన్న వినతిని తిరస్కరించిన న్యాయస్థానం**

హైదరాబాద్,జనవరి11(ఆర్ఎన్ఎ): బోయిన్‌పల్లి కిడ్నాప్ కేసులో ఏపీ మాజీ మంత్రి భూమా అఖిల ప్రియకు సికింద్రాబాద్ కోర్టులో చుక్కెదురైంది. అఖిల ప్రియకు న్యాయస్థానం బెయిల్ నిరాకరించింది. భూమా అఖిలప్రియను పోలీస్ కస్టడీకి కోర్టు అనుమతించింది. మూడు రోజుల పాటు పోలీసుల కస్టడీలో ఆమె ఉండనున్నారు. ఈ కేసులో అఖిలప్రియకు బెయిల్ ఇవ్వొద్దని పోలీసులు కోర్టులో కౌంటరు దాఖలు చేసిన విషయం తెలిసిందే. సాక్ష్యాల సేకరణకు దర్యాప్తు బృందాలు ప్రయత్నిస్తున్నాయని కోర్టుకు పోలీసులు తెలిపారు. అఖిలప్రియ బెయిల్‌పై వస్తే సాక్షులను బెదిరించే అవకాశం ఉందని కోర్టుకు సమర్పించిన కౌంటర్‌లో పేర్కొన్నారు. అఖిలప్రియ చర్యల వల్ల స్థానిక ప్రజలు అభద్రతాభావంలో ఉన్నారని తెలిపారు. అఖిలప్రియకు ఆర్థికంగా, రాజకీయంగా ప్రభావితం చేయగలిగే పలుకుబడి ఉందని పోలీసులు చెప్పారు. బోయినపల్లి కిడ్నాప్ కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న అఖిల ప్రియ బెయిల్ పిటిషన్‌ను సికింద్రాబాద్ కోర్టు తిరస్కరించింది. తన ఆరోగ్యం బాగాలేదని, బెయిల్ ఇవ్వాలని పిటిషన్‌లో ఆమె కోరారు. అయితే వైద్యులు న్యాయస్థానానికి సమర్పించిన వైద్యపరీక్షల్లో ఆమె ఆరోగ్యంగానే ఉన్నట్లు తేలింది. దీంతో బెయిల్ పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. కిడ్నాపు కేసులో ప్రధానంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితురాలిని కస్టడీకి ఇవ్వాలన్న పోలీసుల వాదనతో న్యాయస్థానం ఏకీభవించింది. అఖిలప్రియ బయటకొస్తే సాక్షులను బెదిరించవచ్చని పోలీసులు తమ పిటిషన్లో పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి మరిన్ని వివరాలు రాబట్టడానికి ఆమెను వారంరోజుల పాటు విచారించాల్సి ఉందని పోలీసులు న్యాయస్థానానికి తెలిపారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న అఖిల ప్రియ అనుచరులు మరికొన్ని నేరాలు చేసినట్లు అనుమానాలు ఉన్నాయని, ఆమె భర్త భార్గవ్‌రామ్‌తో పాటు పరారీలో ఉన్న అనుచరులను అరెస్టు చేయాల్సి ఉందని కోర్టుకు నివేదించారు. పోలీసుల వాదన విన్న కోర్టు.. అఖిల ప్రియను మూడు రోజుల పాటు పోలీసుల కస్టడీకి అనుమతించింది. సోమవారం నుంచి అఖిల ప్రియ 13వ తేదీ వరకు పోలీస్ కస్టడీలో ఉండనున్నారు. కాగా బోయిన్‌పల్లి కిడ్నాప్ కేసులో అఖిలప్రియ ఏ1గా ఉన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆమె చంచల్‌గూడ జైల్లో 14 రోజుల రిమాండ్‌లో ఉండగా.. కిడ్నాప్ కేసులో పోలీసులు ప్రశ్నించనున్నారు. మరోవైపు కిడ్నాప్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న అఖిల ప్రియ భర్త భార్గవ్ రామ్‌తో పాటు ఆయన అనుచరుడు శ్రీనివాస్ చౌదరి అలియాస్ గుంటూరు శీను ఇంకా పరారీలోనే ఉన్నారు. వారిద్దరి కోసం మూడు రాష్ట్రాల్లో పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నారు.

# గిఫ్ట్ ఎ స్మైల్ కింద ఆరు అంబులెన్స్‌లు

**ఖమ్మం ఎంపి నామా నాగేశ్వర రావు వితరణ**

**జెండా ఊపి ప్రారంభించిన మంత్రి కెటిఆర్**



హైదరాబాద్,జనవరి11(ఆర్ఎన్ఎ): గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా మంత్రి కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వర్‌రావు ఆరు అంబులెన్స్‌లను అందించి గొప్ప మనసు చాటుకున్నారు. ఈ అంబులెన్స్‌లను మంత్రి కేటీఆర్ జెండా ఊపి ప్రారంభించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రూ.1.23 కోట్ల వ్యయంతో ఆరు నూతన అంబులెన్స్ లను ఎంపీ నామా నాగేశ్వర్‌రావు అందించారు. ఈ అంబులెన్స్‌లను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ఆయా నియోజకవర్గ కేంద్రం లోని ప్రధాన ఆస్పత్రికి అందజేయడం జరుగుతుంది. వీటిని ఖమ్మం పార్లమెంట్ పరిధి లోని ఖమ్మం, పాలేరు, వైరా, మధిర, సత్తుపల్లి, అశ్వారావుపేట, కొత్తగూడెం ప్రభుత్వ హాస్పిటల్స్ కు కేటాయించనున్నారు. ఈ వాహనాల్లో ఆక్సిజన్, వెంటిలేటర్ తో సహా అత్యాధునిక సదుపాయాలు ఉన్నాయి. దేశంలోనే ఏ ఎంపీ కూడా చేయని విధంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజల సంక్షేమం కోసం ఆరు అంబులెన్స్ లు అందించడం పట్ల జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, రాజకీయాలకు అతీతంగా కృతజ్ఞతలు, అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, వైరా ఎమ్మెల్యే రాములు నాయక్, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సైదిరెడ్డి, టీఆర్ఎస్ పార్టీ కార్యదర్శి బండి రమేష్, చిత్తారు సింహాద్రి, నామ పృథ్వీ, నామ భవ్య, ఫోర్స్ మోటార్ ప్రతినిధులు పాల్గొన్నారు.

చరిత్రలో నేటినిజం




# ఒడిషాలో తెరుచుకున్న పాఠశాలలు

**మూడు రోజుల వ్యవధిలో 30మందికి కరోనా**

భువనేశ్వర్,జనవరి11(ఆర్ఎర్ఎ): ఒడిశాలో కరోనా కారణంగా మూతపడ్డ పాఠశాలలు తొమ్మిది నెలల తర్వాత జనవరి 8న తెరచుకున్నాయి.

అయితే కేవలం మూడు రోజుల వ్యవధిలో 30 మందికిపైగా టీచర్లు, విద్యార్థులు కరోనా బారినపడ్డారు. రాష్ట్రంలోని గజపతి జిల్లాలో గత మూడు రోజుల్లో కొత్తగా 31 కేసులు నమోదయ్యాయని జిల్లా వైద్యాధికారి ప్రదీప్ కుమార్ తెలిపారు. అందులో 90 శాతం మంది ఉపాధ్యాయులు, విద్యార్థులే ఉన్నారన్నారు. స్కూళ్లకు వెళ్లడంతో వీరికి కరోనా వైరస్ సోకిందని చెప్పారు.

ఒడిశాలో 10, 12వ తరగతి విద్యార్థులకు శుక్రవారం నుంచి తరగతులు ప్రారంభమయ్యాయి.

అయితే విద్యా సంస్థల ప్రారంభానికి ముందే ఉపాధ్యాయులకు కరోనా పరీక్షలు నిర్వహించారని తెలిపారు. ఇద్దరు విద్యార్థులకు కూడా కరోనా పాజిటివ్ వచ్చిందన్నారు. కాగా, బోర్డు పరీక్షల దృష్ట్యా నిరాటంకంగా వంద రోజులపాటు తరగతులు నిర్వహించాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. ఈనేపథ్యంలో తల్లిదండ్రుల అనుమతితో తగిన జాగ్రత్తలు తీసుకుని విద్యార్థులు తరగతులకు హాజరుకాలని ప్రభుత్వం సూచించింది.

కాగా, రాష్ట్రంలో యూనివర్సిటీలు, కాలేజీల్లో ఈరోజునుంచి చివరి సంవత్సరం విద్యార్థులకు క్లాసులు ప్రారంభమయ్యాయి.

# చైనా సైనికుడి అప్పగింత

న్యూఢిల్లీ,జనవరి11(ఆర్ఎర్ఎ): భారత భూభాగంలోకి వచ్చిన చైనా జవాన్‌ను ఆ దేశ సైన్యానికి ఇండియన్ ఆర్మీ సోమవారం తిరిగి అప్పగించింది. ఈ ఏడాది జనవరి 8వ తేదీన పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ(పీఎల్ఏ) సైనికుడు లఢాక్‌లోని ఎల్ఏసీ వద్ద సరిహద్దు దాటి భారత భూభాగంలోకి వచ్చాడు. అప్రమత్తమైన భారత బలగాలు ఆ సైనికుడిని అదుపులోకి తీసుకున్నాయి. అయితే తమ సైనికుడు అదృశ్యమైనట్టు చైనా ఆర్మీ శనివారం ప్రకటించింది. ఆ తర్వాత తమ భూభాగ పరిధిలోకి వచ్చినందున ఆ సైనికుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఇండియన్ ఆర్మీ ప్రకటించింది. మొత్తంగా ఉదయం 10:10 గంటలకు సరిహద్దులోని చూషల్ - మోల్డో వద్ద సైనికుడిని చైనా సైన్యానికి భారత బలగాలు అప్పగించాయి. గాల్వాన్ ఘర్షణల తర్వాత పీఎల్ఏ సైనికులు భారత భూభాగ పరిధిలోకి రావడం ఇది రెండోసారి. గతేడాది అక్టోబర్‌లో కూడా పీఎల్ఏ సైనికుడు లఢాక్ వద్ద భారత భూభాగంలోకి ప్రవేశించాడు.

# తెలంగాణ మహిళా కమిషన్ ఏర్పాటు సంతోషం: జ్యోత్స్న

హైదరాబాద్,జనవరి11(ఆర్ఎర్ఎ): తెలంగాణ మహిళ కమిషన్ చైర్‌పర్సన్ సునీత లక్ష్మారెడ్డిని రాష్ట్ర తెలుగు మహిళా అధ్యక్షురాలు, తెలుగుదేశం పార్టీ జాతీయ అధికార ప్రతినిధి ప్రొఫెసర్ జ్యోత్స్న తిరునగరి మర్యాదపూర్వకంగా కలిశారు. చైర్‌పర్సన్‌గా ఎంపికైన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. మహిళల భద్రత, తీసుకోవలసిన చర్యలపై ఇరువురూ చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ మహిళా కమిషన్ ఏర్పాటు కావటం సంతోషకరమన్నారు. తెలుగు మహిళల కృషి కారణంగానే మహిళా కమిషన్‌ను సీఎం కేసీఆర్ ఏర్పాటు చేశారన్నారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టడానికి కొత్త చైర్‌పర్సన్ కృషి చేయాలన్నారు. సునీత లక్ష్మారెడ్డిని కలిసిన వారిలో జ్యోత్స్నతో పాటు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ప్రమీల, ప్రధాన కార్యదర్శులు రాధిక, నందిమ్మళ్ళ శారద, వినీత, కార్యనిర్వాహక కార్యదర్శి ఝాన్సీ తదితరులు ఉన్నారు.

# నాసిక్ జిల్లాలో దారుణం

**మైనర్ బాలికపై ఐదుగురు యువకుల అత్యాచారం**

ముంబై,జనవరి11(ఆర్ఎర్ఎ): మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో దారుణం జరిగింది. 13 ఏండ్ల బాలికపై ఐదుగురు యువకులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు.

బాలిక ఇంటి పక్కన బిల్డింగ్‌లోనే ఈ దారుణానికి ఒడిగట్టారు.

బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

అత్యాచారానికి పాల్పడిన ఐదుగురు యువకులతోపాటు వాళ్లకు సహకరించిన ఓ మహిళను, మైనర్ బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. నాసిక్ జిల్లాలోని నాసిక్ రోడ్ ఏరియాలో 13 ఏండ్ల బాలిక తన తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నది.

ఎప్పటిలాగే శనివారం కూడా బాలిక తల్లిదండ్రులు పనులకు వెళ్లడంతో బాలిక ఒంటరిగా ఇంట్లో ఉన్నది.

అయితే, వారి ఇంటి పక్కన బిల్డింగులో ఉండే యువకుల కన్ను ఆ బాలికపై పడింది. దాంతో సదరు యువకులు ఓ మహిళ, మరో మైనర్ బాలుడి సాయంతో ఆ బాలికను బిల్డింగ్‌పైకి రప్పించుకుని సామూహిక అత్యాచారం చేశారు. తల్లిదండ్రులు ఇంట్లో బాలిక కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. ఇంతలో పక్క బిల్డింగ్‌పై నుంచి బాలిక ఏడుపు వినిపించగా కిందికి తీసుకొచ్చారు. ఏం జరిగిందని తల్లిదండ్రులు ఆరా తీయడంతో బాలిక జరిగిందంతా చెప్పింది. దాంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు 19 నుంచి 29 ఏండ్ల మధ్య వయసున్న ఐదుగురు నిందితులతోపాటు వారికి సహకరించిన మైనర్ బాలుడు, మహిళను అరెస్ట్ చేశారు.

# వ్యవసాయ చట్టాలు సహా.. మహిళా బిల్లుపై చర్చించాలి !

నేటి నిజం

మంగళవారం 12-1-2021

ఈనెల 31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కాబోతున్నాయి. 1న బడ్జెట్ ప్రవేశ పెడుతున్నారు. అనేక సమస్యలు దేశంలో నెలకొన్న వేళ ఆయా సమస్యలపై చర్చ జరగాలి. ఇప్పటికే వ్యవసాయ చట్టాలపై వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. ప్రభుత్వం మాత్రం దిగివచ్చేలా కనిపించడం లేదు. రైతులు తమ ఆందోళన కొనసాగిస్తున్న వేళ..మరోమారు 15న రైతు సంఘాలతో చర్చిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ క్రమంలో రైతులను బుజ్జగించి ఆందోళన విరమించేలా చేయాలి. అలాగే వ్యవసాయ చట్టాలపై సమగ్ర చర్చ చేయాలి. వ్యవసాయ చట్టాలు మంచివే అయితే పార్లమెంటులో మరోమారు చర్చకు అవకాశం ఇవ్వాలి. దీనిపై ఎవరి వాదనలు వారు చేసే అవకాశం ఇవ్వాలి. పార్లమెంటులో అనవసర యాగీల తో కాలక్షేపం చేసే విపక్షాలు కూడా నిర్మాణాత్మక ధోరణితో ఉడాలి. సమస్య ఏదైనా చర్చ చేసేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చే వాతావరణం కల్పించాలి. వ్యవసాయ చట్టాలు, కరోనా కష్టాలు, బ్యాంకుల నిర్లక్ష్యం, మహిళా బిల్లు ఇలా అనేకానేక సమస్యలను చర్చించేలా ప్రభుత్వపై ఒత్తిడి తీసుకుని రావాలి. గందరోగళ పరిస్థితులు తీసుకుని రాకుండా ఉభయసల్లో సమస్యలే ఎజెండాగా వచ్చే బడ్జెట్ సమావేశాలు జరగిగేలా చూడాలి. ఇకపోతే మహిళా బిల్లు ఎప్పటి నుంచో కోల్డ్ స్టోరేజ్ దాటి బయటకు రావడం లేదు. ఈ విషయంలో అధికార, విపక్ష సభ్యులకు ఇందులో పపూర్తి బాధ్యత ఉంది. ఏళ్లు గడుస్తున్నా దీనిపై పార్లమెంటులో కనీసం ప్రస్తావన కూడా చేయడం లేదు. పార్లమెంట్ కొత్తభవనం కడుతున్న వేళ..సభ్యుల సంఖ్య పెంచాలన్న అవకాశాలను పరిశీలిస్తున్న వేళ మహిళా బిల్లుపై సమగ్ర చర్చ జరాలి. చట్టసభల్లో మహిళలకు కోటా అమలు కావాలి. దీనిపై అధికార పార్టీని ఒప్పించే ప్రయత్నం చేయడాలి. ఇందుకు విపక్షాలదే బాధ్యత. భారత రాజకీయాల్లో మహిళలు కీలక భూమిక పోషిస్తున్నా గత రెండు దశాబ్దాలుగా మహిళా బిల్లు మాత్రం గట్టెక్కలేకపోతోంది. సంపూర్ణ మెజార్టీ ఉన్నా మహిళా బిల్లుకు మాత్రం మోక్షం దక్కడంలేదు. దీనిని గట్టెక్కించడంలో కనీసం ప్రస్తావన కూడా జరగలేదు. మోడీ అధికారం లోకి వచ్చిన రెండోసారి అనేక విప్లవాత్మక బిల్లులకు మోక్షం దక్కినా ఈ బిల్లుకు మాత్రం చోటు దక్కడం లేదు. అన్నింటా మహిళల గురించి మాట్లాడుతున్న వారు రాజకీయ రిజర్వేషన్ల విషయంలో మాత్రం మొహం తిప్పేస్తున్నారు.

త్రిపుల తలాక్ తీసుకుని వచ్చిన మాదిరిగానే మహిళా బిల్లును కూడా గట్టెక్కిస్తే మహిళలు చిరకాం గుర్తుంచుకుంటారు. బిజెపి కూడా మహిళా బిల్లును తీసుకుని రావడంలో పెద్దగా ఆసక్తి కనబర్చడం లేదు. పార్టీలకు అతీతంగా దేశంలో ఉన్న మహిళలు దీనిపై ఆందోళనకు దిగాలి. మహిళా బిల్లును తీసుకుని రాలేకపోవడం బిజెపి ఘోర వైఫ్యల్యంగానే చూడాలి. మహిళా బిల్లుకు సంబంధించి మోడీ ఇంతకాలం అయినా తన ఆలోచనలను వెల్లడించడం లేదు. దీంతో గత కొన్నేళ్లుగా ఇది కోల్డ్ స్టోరేజిని దాటి బయటకు రావడం లేదు. దేశం జనాభాలో సగంశాతం మంది మహిళలు కోరకుంటున్న మహిళా బిల్లుపై ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేయడం లేదు. లోక్‌సభలో సంపూర్ణ మెజార్టీ ఉన్నా మోడీ ప్రభుత్వం దీనిని ముందుకు తీసుకుని వచ్చే ప్రయత్నం చేయలేదు. ఎన్నో అవరోధాల మధ్య కూడా మహిళలు ఆయా రంగాల్లో శక్తిమంతమైన పాత్రను నిర్వహిస్తున్నారు. సమాజంలో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకుంటూనే ఉన్నారు. మహిళాభ్యుదయమే దేశాభ్యుదయం అని అనేక సందర్భాల్లో ప్రకటిస్తున్నా పొలిటికల్ పవర్ విషయంలో మాత్రం మగాళ రాజ్యం నడుస్తోంది. అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలను ఎందుకనో రాజకీయంగా ముందుకు సాకుండా అణగదొక్కు తున్నారు. ఇలా వారిని అణచి వేయడం వల్ల 50శాతం జనాభా ఆకాంక్షలను కాలరాస్తున్న వారు అవుతున్నారు. మహిళా సాధికారతతో ప్రజాస్వామ్య వ్యవస్థను

బలోపేతం చేయడమే లక్ష్యంగా పాలన సాగాలి. చట్టసభల్లో మూడోవంతు రిజర్వేషన్లు ఎవరి దయాధర్మం గానో కాకుండా హుక్కుగా, సగౌరవంగా లభించాల్సి ఉంది.

మహిళలకు సముచిత భాగస్వామ్యం కల్పించి నప్పుడే సామాజిక ప్రగతి సాధ్య పడుతుంది. మహిళా సమానత్వమే సమాజానికి హితం చెబుతున్న పాలకులు సమాన గౌరవం ఇచ్చి చట్టసభల్లో ప్రవేశించేలా చేయడంలో మాత్రం విఫలం అవుతున్నారు. పాలనలో వారికి భాగస్వామ్యం కల్పించకుండా వారిని అణగదొక్కే కుట్రల్లో రాజకీయా పార్టీలు తమవంతు పాత్ర పోషించాయి. మహిళల హక్కుల అమలులో ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోకుండా చూడాలి. ప్రజాస్వామ్యంలో కేవలం అధికారపక్షమే కాదు ప్రతిపక్షాలకూ, ప్రజలందరికీ పాత్ర ఉంటుంది. ఇది గమనించి అందరూ ముందుకు సాగాలి. ప్రభుత్వాలు ఏకపక్ష ధోరణితో మహిళలను విభజించి పాలించే తీరు పక్కన పెట్టకుంటే అది ఎంత మాత్రం సాధికారత సాధనకు ఉపయోగపడదు.

మహిళా సాధికారత సంగతేమో వారి కనీస హక్కులు మృగ్యమయ్యాయి. స్త్రీలు, విద్యార్థినిలకు రక్షణ లేకుండా పోయింది. మహిళలపై దాడులను యథేచ్ఛగా కొనసాగిస్తూ, వారి హక్కులను కాలరాస్తూ, మహిళా సాధికారత సాధిస్తామనడం సరికాదు. భారతీయ సమాజం విలువలు కాపాడేలా మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలి. వారికి రాజకీయంగా హక్కుల కల్పనకు పోరాడాలి.

మహిళల్లో స్ఫూర్తిని నింపడమే గాకుండా, వారిలో ఆత్మస్థయిర్యాన్ని నింపి వారిని మనతో సమానంగా ముందుకు తీసుకుని వెళ్లడంలో అధికార పార్టీ నేతలు ముందుకు రావాలి. ఎన్ని చట్టాలు చేసినా మృగాళ్ల మదోన్మాదం, కుటుంబ సభ్యుల కామ దాహం, అధికారులు, సహోద్యోగుల వికృత చేష్టలు వాళ్ల పాలిట శాపాలవుతున్నాయి. దీనికి తోడు మత ఛాందస వాదం మహిళా సమానత్వానికి మరింత హానికరంగా తయారైంది. భ్రూణ హత్యల కారణంగా దేశంలో క్షీణిస్తున్న అమ్మాయిల నిష్పత్తి ఆందోళన కలిగిస్తోంది. ఈ క్రమంలో. బిజెపి ఆదర్శాలు వల్లించేకన్నా మహిళా బిల్లును త్వరగా గట్టెక్కించే ప్రయత్నం చేయాలి. రాజకీయంతో పాటు వివిధ రంగాల్లో ఉన్న మహిళిలు ఇందుకు ఒత్తిడి పెంచాలి. అలాగే రాజకయా పార్టీల నేతలు కూడా వ్యవసాయ బిల్లులతో పాటు అనేక సమస్యలపై సమగ్ర చర్చకు ప్రభుత్వాన్ని ఒప్పించాలి.

## వ్యాక్సినేషన్ తరవాతే ఎన్నికలు పెట్టాలి

### ఉద్యోగ సంఘాల జెఏసి స్పష్టీకరణ

అమరావతి,జనవరి11(ఆర్ఎన్ఎ): ఎస్ఈసీ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ మొండి వైఖరిని ఉద్యోగ సంఘాలు తప్పుపట్టాయి. కోవిడ్ జాగ్రత్తలు పాటిస్తూ ఎన్నికల విధుల్లో పాల్గొనమనడంపై మండిపడుతున్నారు. నిమ్మగడ్డ ప్రకటనపై జేఏసీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. పీపీఈ కిట్లు, మాస్క్‌లు కరోనాను అడ్డుకోగలవా? అని ఏపీ ఉద్యోగుల జేఏసీ ప్రశ్నించింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నికల విధుల్లో పాల్గొనలేం. గడిచిన 10 నెలల్లో ఎంతో మంది ఉద్యోగులు కరోనాతో ప్రాణాలు కోల్పోయారు. ఉద్యోగుల ప్రాణాలు ఎస్ఈసీకి పట్టవా?.ఎన్నికల నిర్వహణ అంత చిన్న విషయం కాదు.మరో మూడు నెలలు స్థానిక ఎన్నికలు వాయిదా వేయాలి.ఉద్యోగుల విజ్ఞప్తిని ఎస్ఈసీ పరిగణలోకి తీసుకోవాలి. వ్యాక్సినేషన్ తర్వాత స్థానిక ఎన్నికలు నిర్వహించాలి. ఉద్యోగులను విమర్శించే అర్హత టీడీపీ నేత అశోక్‌బాబుకు లేదు. రాజకీయ వ్యవహారాలు చూసుకోవాలంటూ' జేఏసీ నేత బొప్పరాజు వెంకటేశ్వర్లు కౌంటర్ ఇచ్చారు. పీపీఈ కిట్లు, మాస్క్‌లు, శానిటైజర్లు కరోనాను ఆపలేవని పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనకుల శ్రీనివాసరావు మండిపడ్డారు. కరోనాతో ఎంతో మంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారని, వ్యాక్సినేషన్ తర్వాతే ఎన్నికలు నిర్వహించాలన్నారు. తమ విజ్ఞప్తిని ఎస్ఈసీ పునరాలోచించాలని ఆయన కోరారు.

## ప్రముఖ జర్నలిస్ట్ పద్మశ్రీ తుర్లపాటి మృతి

### గుండెపోటుతో ఆస్పత్రిలో కన్నుమూత

### సతాపం తెలిపిన సిఎం జగన్ తదితరులు

విజయవాడ,జనవరి11(ఆర్ఎన్ఎ): ప్రముఖ జర్నలిస్ట్ పద్మశ్రీ తుర్లపాటి కుటుంబరావు(89) కన్నుమూశారు. గత రాత్రి కుటుంబరావు గుండెపోటుకు గురికావడంతో వెంటనే విజయవాడలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అర్ధరాత్రి 12:30 గంటలకు తుదిశ్వాస విడిచారు. 1933 ఆగస్టు 10న జన్మించిన తుర్లపాటి 14 ఏళ్ల వయస్సులో జర్నలిజంలోకి అడుగు పెట్టారు. జాతీయ, అంతర్జాతీయ అవార్డులు పొందారు. ఆంధ్రజ్యోతి దినపత్రికకు ఎడిటోరియల్ ఎడిటర్‌గా తుర్లపాటి పనిచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొదటి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశంకు సెక్రెటరీగా పని చేశారు. జాతక కథలు, జాతి రత్నాలు, జాతి నిర్మాతలు, మహా నాయకులు, విప్లవ వీరులు, 18మంది ముఖ్యమంత్రులతో నా ముచ్చట్లు, నా కలం..నా గళం లాంటి పుస్తకాలను ఆయన రచించారు. విదేశాల్లో 20,000లకు పైగా సభల్లో ఉపన్యాసాలు చేసిన తుర్లపాట గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించారు. సీనియర్ జర్నలిస్ట్, పద్మశ్రీ తుర్లపాటి కుటుంబరావు మృతి పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం తెలిపారు. కుటుంబరావు కుటుంబ సభ్యులకు వైఎస్ జగన్ తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన మృతి పట్ల ప్రజాప్రతినిధులు, జర్నలిస్టులు సంతాపం తెలిపారు. తుర్లపాటి మృతిపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ తాపం వ్యక్తం చేస్తూ ఓ ప్రకటనను పవన్ విడుదల చేశారు. తుర్లపాటి నవతరం జర్నలిస్టులకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. తెలుగు సినిమా విశిష్టతపై తుర్లపాటి చక్కటి కథనాలు, వ్యాసాలు అందించారని గుర్తు చేసుకున్నారు. ఆయన మరణం బాధ కలిగించింది. వారి ఆత్మకు శాంతి చేకూరాలని దైవాన్ని ప్రార్థిస్తున్నాను. తెలుగు పాత్రికేయ రంగంలో విలువలకు పట్టంగట్టారు కనుకనే 'పద్మశ్రీ' పురస్కారాన్ని పొందిన తొలి తెలుగు పాత్రికేయుడిగా నిలిచారు. నవతరం జర్నలిస్టులకు తుర్లపాటి కుటుంబరావు స్ఫూర్తిగా నిలిచారు. తెలుగు సినీ రంగానికి సెన్సార్ బోర్డు సభ్యులుగా గణనీయమైన సేవలందించారు. తెలుగు సినిమా విశిష్టతపై చక్కటి కథనాలు, వ్యాసాలు అందించారు. ఆయన మృతికి వారి కుటుంబ సభ్యులకు నా తరుపున, జన సైనికుల పక్షాన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను అని పవన్ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రముఖ జర్నలిస్టు తుర్లపాటి కుటుంబరావు మృతి పట్ల టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సంతాపం తెలిపారు. పాత్రికేయ దిగ్గజం, ప్రఖ్యాత రచయిత, విమర్శకులు, వక్త తుర్లపాటి కుటుంబరావు మృతి తెలుగు పాత్రికేయ, సాహితీ, కళారంగాలకు తీరని లోటన్నారు. పద్మశ్రీతోపాటు లెక్కకు మించిన పురస్కారాలు వరించినా నిరాడంబర జీవనం సాగించారని తెలిపారు. తన తుదిశ్వాస వరకూ రచనా వ్యాసంగాన్ని కొనసాగించి పాత్రికేయ భీష్ముడిగా పేరొందారని కొనియాడారు. బహుముఖ ప్రజ్ఞాశాలి తుర్లపాటి కుటుంబరావు కుటుంబసభ్యులకు లోకేష్ తన ప్రగాఢసంతాపం తెలియజేశారు. పద్మశ్రీ తుర్లపాటి కుటుంబరావు మృతి పాత్రికేయ లోకానికి తీరని లోటు అని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నెహ్రూ యువ కేంద్ర నేషనల్ వైస్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. తుర్లపాటి కుటుంబరావు భావితరాల పాత్రికేయులకు ఆదర్శమన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారి ఆత్మకు శాంతి కలగాలని విష్ణువర్ధన్ అన్నారు.

## పార్టీ సేవకులుగా ఉద్యోగ సంఘాల నేతలు

### -టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్‌రెడ్డి

అయరావతి,జనవరి11(ఆర్ఎన్ఎ): ఉద్యోగ సంఘం నేతలు అధికార పార్టీ సేవకులుగా మారారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్‌రెడ్డి మండిపడ్డారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల డ్యూటీ వద్దనే వారికి వైన్‌షాపుల వద్ద డ్యూటీ ముద్దుగా ఉందా అని ప్రశ్నించారు. ఎన్నికల కమిషన్‌కు వ్యతిరేకంగా మాట్లాడుతున్న తీరు అభ్యంతరకరమని చెప్పారు. చంద్రశేఖర్‌రెడ్డికి వైసీపీ నేతలతో బంధుత్వం ఉందన్నారు. వెంకట్రామరెడ్డి భార్య శ్వేతారెడ్డి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ తరపున ప్రచారం చేశారన్నారు. కులం, స్వార్థం కోసమే సీఎం జగన్‌రెడ్డిని వెనకేసుకొస్తున్నారని మండిపడ్డారు. పీఆర్సీ, సీపీఎస్ రద్దు, కాంట్రాక్టు ఉద్యోగుల భద్రత ఏనాడూ పట్టించుకోలేదని దుయ్యబట్టారు. ఎన్నికల డ్యూటీ చేస్తే ప్రాణాలు పోతాయనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వేలాది మందితో ఊరేగింపులు సభలు నిర్వహిస్తే రాని కరోనా ఎన్నికలు నిర్వహిస్తే ఎలా వస్తుందని సుధాకర్‌రెడ్డి ప్రశ్నించారు.

## జై జవాన్ జై కిసాన్' నినాదంతో హోరెత్తించిన లాల్ బహదూర్ శాస్త్రి

### (11 జనవరి 'లాల్ బహదూర్ శాస్త్రి వర్ధంతి' సందర్భంగా)

02 అక్టోబర్ 1904న ఉత్తరప్రదేశ్, వారణాసి సమీప ముగల్‌సరాయ్ పట్టణంలో రమాదులారి దేవి మరియు శారద ప్రసాద్ శ్రీవాస్తవల ముద్దుబిడ్డగా లాల్ బహదూర్ శాస్త్రి జన్మించారు. మహాత్మాగాంధీ పుట్టిన రోజుననే శాస్త్రి జన్మించడంతో లాల్ బహదూర్ జయంతి కొంత మరుగున పడడం జరుగుతున్నది. శాస్త్రి తన ఒకటిన్నర ఏళ్ల లోనే తండ్రిని కోల్పోయి తల్లి పెంపకంలో ఎదిగారు. ప్రతి రోజు మైళ్ల దూరం చెప్పులు లేకుండా కాలినడకతో మరియు పడవకు డబ్బులు లేని కారణంగా ఈదుతూ నది దాటి వారణాసికి చేరి పాఠశాల విద్యను పూర్తి చేసి, దేశభక్తితో భారత జాతీయ కాంగ్రెస్‌లో చేరారు. కులమతాలకు అతీతంగా సేవలందిస్తూ, తన పేరులోని 'శ్రీవాస్తవ' ఇంటి పేరును తొలగించుకున్న మహానుభావుడిగా శాస్త్రి మనందరికీ ఆదర్శప్రాయుడు మరియు అనుసరణీయుడిగా నిలిచారు. స్వామి వివేకానంద, మహాత్మాగాంధి మరియు అన్నీ బిసెంట్‌ల జీవితాలతో ప్రభావితం అయిన శాస్త్రి, చదువులకు స్వస్తి పలికి, విదేశీ పాలనకు వ్యతిరేకంగా గళమెత్తి సహాయనిరాకరణోద్యమంలో పాల్గొంటూనే హరిజనోద్ధరణకు కృషి చేశారు. కాశీ విద్యాపీఠ్ విశ్వవిద్యాలయంలో విద్యను అభ్యసించి 'శాస్త్రి (స్కాలర్)' అనే బిరుదు పొందారు. 1928లో కట్నంగా చరకా మరియు ఖాదీ వస్త్రాలను మాత్రమే తీసుకొని లలితా దేవిని వివాహమాడారు. జె బి కృపలాని, లాలా లజపతిరాయ్ లాంటి ప్రముఖులతో కలిసి జాతి ఉద్ధరణ యజ్ఞంలో పాల్గొన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొంటూ మూడున్నరేళ్లు (1928/1940) జైలు పాలైనారు. క్విట్ ఇండియా, ఉప్పు సత్యాగ్రహాల లాంటి జాతీయ ఉద్యమాలలో క్రియాశీలంగా పని చేసి అందరి మన్ననలు పొందారు.

స్వాతంత్ర్యానంతరం 1947లో యూపి అసెంబ్లీలో గోవింద్ బల్లబ్ పంత్ నేతృత్వంలో రవాణా మరియు పోలీస్ శాఖల మంత్రిగా పనిచేస్తూ మె?దటిసారి మహిళా డ్రైవర్లు మరియు కండక్టర్లను నియమించడంతో పాటు మత అల్లర్లపై ఉక్కుపాదం మోపారు. 1951లో జాతీయ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా 1952, 1957 మరియు 1962 లోకసభ ఎన్నికల విజయప్రస్థానంలో భాగస్వామి అయినారు. నెహ్రూ చొరవతో 1951లో రాజ్యసభ సభ్యుడిగా నియమించబడ్డారు. భారత విదేశాంగ, రైల్వే, వాణిజ్య - పరిశ్రమలు, రవాణా - సమాచార మరియు హోంశాఖల మంత్రిగా తన సత్తా చాటారు. అలీనోద్యమ నేతగా శ్రీలంక తమిళుల సమస్యకు పరిష్కారం చూపే 'సిరిమావో–శాస్త్రి ఒప్పందం'పై సంతకం చేశారు. రైల్వేశాఖ మంత్రిగా పని చేసిన సందర్భంగా జరిగిన రైలు ప్రమాదానికి మంత్రిగా భాద్యత వహించి రాజీనామా చేసి ఆదర్శంగా నిలిచి, ప్రజల మన్ననలు పొందారు. జవహర్ లాల్ నెహ్రూ మరణానంతరం (27 మే 1964) భారతదేశ 3వ ప్రధానిగా (9 జూన్ 1964 - 11 జనవరి 1966) విశిష్ట సేవలు అందించిన స్వాతంత్ర్య సమరయోధుడు, నిబద్ధతగల దేశభక్తికి నిలువెత్తు రూపమైన శాస్త్రి చొరవతో 'శ్వేత విప్లవం' మరియు 'హరిత విప్లవాల'కు పునాదులు పడ్డాయి. 'జై జవాన్ - జై కిసాన్' నినాదంతో హోరెత్తించిన శాస్త్రి నేతృత్వంలో జరిగిన 1965 ఇండో–పాక్ యుద్ధాన్ని 22–రోజుల్లోనే విజయం సాధించారు. ఐరాస చొరవతో 10 జనవరి 1966న రష్యా తాష్కంట్ (ప్రస్తుత ఉజ్బెకిస్థాన్) ఒప్పందంతో యుద్ధ విరమణ జరిగిన మరుసటి రోజు 11 జనవరి 1966న అనుమానాస్పదంగా (విష ప్రయోగంతో) గుండె పోటుతో మరణించారు.

'లిటిల్ డైనమో ఆఫ్ ఏ మాన్'గా పేరొందిన శాస్త్రీ అకాల మరణం జాతిని శోక సముద్రంలో ముంచింది. అమరత్వం పొందిన భరతమాత ముద్దుబిడ్డ పేరున ఢిల్లీలో 'విజయ్ ఘాట్' స్మారక స్ఫూర్తి చిహ్నం నిర్మించారు. 30 ఏళ్లకు పైగా జీవితాన్ని దేశానికి అంకితం చేసిన 5 అడుగుల 2 అంగుళాల సమర్థుడు లాల్ బహదూర్ శాస్త్రి సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం మరణానంతరం 'భారత రత్న' అవార్డును ప్రకటించారు. 'శారీరకంగా పొట్టి వాడిని అయినప్పటికీ మానసికంగా బహు గట్టి వాడినే' అన్న మాటలను రుజువు చేసుకున్న లాల్ బహదూర్ శాస్త్రి నైతికత, సహనశీలి, నిరాడంబర, నిస్వార్థ జీవనశైలి నేటి భారతీయులకు దీపస్తంభంగా దారి చూపుతున్నాయి. 'భిన్నత్వంలో ఏకత్వం సాధించిన ఘనత నా భారతదేశానిది' అంటూ నిత్యం జాతిహిత ఆలోచనలతో అసమాన్య దేశభక్తిని శ్వాసించిన లాల్ బహదూర్ శాస్త్రీ జీవితం నేటి యువభారతానికి మార్గదర్శనం చేయాలని ఆశిద్దాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## ప్రభుత్వ పథకాల అమలులో ఎంపీడీవోలు కీలకం

హైదరాబాద్, జనవరి11: ప్రభుత్వ పథకాల అమలులో పంచాయతీరాజ్ ఉద్యోగుల పాత్ర కీలకమని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ అన్నారు. తెలంగాణ మండల పరిషత్ అభివృద్ధి అధికారుల రాష్ట్ర సంఘం డైరీ, క్యాలెండర్‌లను ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అనేక కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో ఎంపీడీవోలు సమర్థవంతంగా పని చేస్తున్నారన్నారని అభినందించారు.

ప్రజలను ప్రభుత్వ పథకాలలో భాగస్వాములను చేస్తూ ఆయా పథకాలు విజయవంతం చేయడంలో పంచాయతీరాజ్ ఉద్యోగులు ప్రతిభను కనబరుస్తున్నారని మంత్రి చెప్పారు.

సీఎం కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పల్లె ప్రగతి కార్యక్రమం విజయవంతం కావడంలో లో ఎంపీడీవోల పాత్ర ఎంతో ఉందన్నారు. పదోన్నతుల విషయంలో ఎంపీడీవోలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి ఎర్రబెల్లి చెప్పారు.

మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేర్చడంలో అధికారుల పాత్ర కీలకమన్నారు. ఎంపీడీవోలు పంచాయతీరాజ్ వ్యవస్థలో అత్యంత కీలకంగా పని చేస్తున్నారని వారిని అభినందించారు. ఎంపీడీవోల పదోన్నతుల విషయంలో సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయం సానుకూలంగా ఉన్నందున ఎలాంటి ఆందోళన అవసరం లేదని ఆయన చెప్పారు.




కార్యక్రమంలో టీజీవోల సంఘం అధ్యక్షురాలు మమత, కార్యదర్శి సహదేవ్, డిప్యూటీ సీఈఓల సంఘం అధ్యక్షుడు బి. రాఘవేందర్ రావు, తెలంగాణ మండల పరిషత్ అభివృద్ధి అధికారుల రాష్ట్ర సంఘం అధ్యక్ష కార్యదర్శులు సత్తయ్య, ప్రశాంతి, ఉపాధ్యక్షులు మల్లికార్జున్, ప్రచార కార్యదర్శి నరేందర్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ శంకర్ నాయక్, శ్రీనివాస్, భాస్కర్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## భూ వివాదంలో దారుణం

### మహిళను వాహనంతో ఢీకొట్టి చంపిన దుండగులు

మహబూబ్‌నగర్,జనవరి11 (ఆంఎర్ఎ): పొలం అమ్మిన డబ్బు విషయంలో బంధువుల మధ్య ఏర్పడిన వివాదం ఓ మహిళ హత్యకు దారితీసింది. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం మాచారం గ్రామానికి చెందిన యాదయ్య ప్రస్తుతం షాద్ నగర్ లో ఉంటున్నాడు. యాదయ్య తల్లి, ఆమె ముగ్గురు చెల్లెళ్లకు కలిపి జడ్చర్ల మండలం గొల్లపల్లిలో ఎకరం ఎనిమిది గుంటల పొలం ఉంది. దీన్ని ఆర్నెల్ల కిందట యాదయ్య 80 లక్షలకు అమ్మాడు. ఇందులో తమ వాటా ఇవ్వాలని చిన్నమ్మ కుమారులు అడిగినా ఇవ్వలేదు. ఆదివారం ఉదయం యాదయ్య తన భార్య శైలజ,కుమార్తె నిహారికతో కలిసి బైక్ పై నవాబ్ పేట్ మండలం కారుకొండలో బంధువుల ఇంట్లో ఫంక్షన్ కి వెళ్లాడు. సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో తిరిగి షాద్ నగర్ కు బయలుదేరారు. ఇది గమనించిన యాదయ్య చిన్నమ్మ కుమారుడు నర్సింహులు సరుకులు రావాణా చేసే వాహనంతో వెంటాడు. మాచారం శివారులో వెనుక నుంచి వచ్చి యాదయ్య బైక్ ను ఢీకొట్టాడు. దీంతో ముగ్గురు కిందడిపోయారు. వెంటనే తేరుకున్న యాదయ్య లేచి కొంత దూరం పరుగెత్తాడు. కిందపడిపోయిన ఆయన భార్య శైలజ పైకి లేచేందుకు ప్రయత్నిస్తుండగా వాహనంతో రెండోసారి ఢీకొట్టాడు నర్సింహులు. ఆమె మళ్లీ కిందపడటంతో వాహనాన్ని పైకి ఎక్కించాడు. దీంతో శైలజ అక్కడికక్కడే చనిపోయింది. నిందితుడు తన వాహనాన్ని అక్కడే వదిలేసి పారిపోయాడు. గాయపడిన యాదయ్య, నిహారికలను స్థానికులు షాద్ నగర్ హాస్పిటల్ కు తరలించారు. పొలం అమ్మిన డబ్బు వివాదంలో తమను బంధువులే హత్య చేసేందుకు ప్రయత్నించారని యాదయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

### ఎంఐఎం నేత దారుణ హత్య

రంగారెడ్డి,జనవరి11(ఆర్ఎన్ఎ): జిల్లాలోని రాజేంద్రనగర్ ఆదివారం రాత్రి దారుణ హత్య జరిగింది. స్థానిక ఎంఐఎం నేత మహమ్మద్ ఖలీల్ ను ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు వెంబడించి చంపారు. నడిరోడ్డుపై అతన్ని కత్తులు, రాళ్లతో కొట్టి చంపారు. రాజేంద్రనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో పిల్లర్ నెంబర్ 260 ఎచ్ఎఫ్ ఫంక్షన్ హాల్ ఎదురుగా ఈ దారుణం జరిగింది. దీనిపై సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. భూ వివాదాలే ఈ హత్యకు కారణమై ఉండొచ్చని భావిస్తున్నారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## 9 రాష్ట్రాలకు విస్తరించిన బర్డ్‌ఫ్లూ

న్యూఢిల్లీ,జనవరి11(ఆర్ఎన్ఎ): దేశంలో బర్డ్ ఫ్లూ కలకలం సృష్టిస్తున్నది. దేశ రాజధాని కూడా బర్డ్ ఫ్లూ విస్తరించింది. ఢిల్లీలో చనిపోయిన కాకులు, బాతులకు సంబంధించిన ఎనిమిది నమూనాలను భోపాల్‌లోని ల్యాబ్‌కు పంపించారు. అందులో బర్డ్ ఫ్లూ కారణంగానే అవన్నీ మరణించాయని తేలింది. దీంతో బర్డ్ ఫ్లూ కేసులు నమోదైన రాష్ట్రాల సంఖ్య తొమ్మిదికి చేరింది. నిన్న సంజయ్ లేక్‌లో 17 బాతులు చనిపోయాయి. దీంతో అధికారులు అప్రమత్తయ్యారు. ఆప్రాంతంలో ఉన్న పార్కులను ఢిల్లీ దెవలప్‌మెంట్ అథారిటీ (డీడీఏ) మూసివేసింది. కాగా, గత కొన్నిరోజులుగా డీడీఏ పార్కుల్లో 14 చనిపోయిన కాకులను గుర్తించామని అధికారులు తెలిపారు. ఈనేపథ్యంలో హౌజ్ ఖాస్ పార్క్, ద్వారకా సెక్టార్ 9 పార్క్, హస్తల్ పార్కులను శని వారం మూసివేశారు. మహారాష్ట్రలో కూడా బర్డ్ ఫ్లూతో 800 కోళ్లు చనిపోయాయి. రాష్ట్ర రాజధాని ముంబైకి 500 కి.మీ. దూరంలో ఉన్న పర్భణీ జిల్లాలోని మురుంబా గ్రామంలో ఉన్న ఫౌల్ట్రీ ఫామ్‌లలో సుమారు 800 కోళ్లు బర్డ్ ఫ్లూతో చనిపోయాయి. దీంతో అక్కడ ఉన్న మొత్తం కోళ్లను చంపేయాలని అధికారులు ఆదేశించారు. కాగా, రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ పరిస్థితులపై సీఎం ఉద్ధవ్ ఠాక్రే అధికారులతో మరికొద్ది సేపట్లో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. దేశంలో ఇప్పటికే ఉత్తరప్రదేశ్, కేరళ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, హర్యానా, గుజరాత్ రాష్ట్రాల్లో బర్డ్ ఫ్లూ కేసులు నమోదయ్యాయి.

### కాకులు,బాతుల మరణాల గుర్తింపు

## పంచాయితీల్లో డంపింగ్ యార్డులు తప్పనిసరి

ఆదిలాబాద్,జనవరి11(ఆర్ఎన్ఎ):గ్రామాల్లో ఉన్న డంపింగ్ యార్డుల్లోకి చెత్తను తరలించేలా చూడాలని జిల్లా పంచాయతీఅధికారి కార్యదర్శులు, సిబ్బందికి సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో కార్యక్రమాల అమలును సమీక్షించారు.ప్రతి గ్రామంలో డంపింగ్ యార్డు ఉండేలా చూడాలని, ఉన్న వాటిలోనే చెత్తను వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో వైకుంఠధామాలు ఏర్పాట్లు పూర్తి చేయాలని చెప్పారు. గ్రామాల్లో స్థలం లేనిచోట ప్రైవేటు స్థలాన్ని కొనుగోలు చేస్తామన్నారు. ప్రతి ఇంటా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో పెంటలను గ్రామానికి దూరంగా ఏర్పాటు చేసుకోవాలని గ్రామస్తులకు చెప్పాలన్నారు. లేదంటే కంపోస్టు ఫీట్స్ నిర్మించి ఇవ్వాలని, దీంతో రైతుకు సేంద్రియ ఎరువు తయారు చేసుకునే వీలు కలుగుతుందన్నారు. ఇవన్నీ 30 రోజుల ప్రణాళికలో పూర్తయ్యేలా చూసుకోవాలని చెప్పారు.

## జిల్లాల్లో పరిశ్రమలకు ప్రోత్సాహం

వరంగల్,జనవరి11(ఆర్ఎన్ఎ): బంగారు తెలంగాణ సాధనలో వరంగల్‌ని టూరిజం హబ్‌గా చేస్తామని మంత్రి ఎర్రబెల్లి అన్నారు. నిట్ లాంటి పెద్ద విద్యా సంస్థలు వరంగల్ ఉన్నాయని... అక్కడ ఏర్పాటు చేయబోయే కాకతీయ టెక్స్టైల్ పార్క్ దేశంలోనే పెద్దదని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటికే వరంగల్ లో కొన్ని ఐటీ కంపెనీలు ఏర్పాటు చేశాయన్నారు. ప్రవాస భారతీయులు వరంగల్ లాంటి నగరంలో పెట్టుబడులు పెట్టాలని పిలుపునిచ్చారు. వరంగల్ గ్రామీణ, నగరాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతామని అన్నారు.

## ఆదిలాబాద్‌కు ప్రత్యేక బస్సులు

ఆదిలాబాద్,జనవరి11(ఆర్ఎన్ఎ): సంక్రాంతి సెలవులను దృష్టిలో ఉంచుకొని జిల్లాకు సెలవుల కోసం వచ్చే వారికోసం ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. వారి సౌకర్యార్థం హైదరాబాద్‌లోని జేబీఎస్ నుంచి ఆదిలాబాద్‌కు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు తమతమ సొంత గ్రామాలకు వెళ్లేందుకు ఇబ్బందుల్లేకుండా వీటిని ఏర్పాటు చేశామని చెప్పారు. రోజూవారి బస్సులతో పాటు జేబీఎస్ నుంచి ఆదిలాబాద్‌కు ప్రత్యేకంగా ఎక్స్‌ప్రెస్ బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. వీటికి సైతం రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించామన్నారు. ప్రయాణికులు ఇంటర్‌నెట్ ద్వారా సీటు రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఆర్టీసీని ఆదరించి ఈసదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## మహిళల సంక్షేమానికి పెద్దపీట: కోవలక్ష్మి

ఆసిఫాబాద్,జనవరి11(ఆర్ఎన్ఎ): బంగారు తెలంగాణ రాష్ట్ర నిర్మాణమే తెరాస ప్రభుత్వ ధ్యేయమని జడ్పీ ఛైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు.ప్రభుత్వం ఆసరా పింఛను, ఆహార భద్రత, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, ఇలా అనేక పథకాలను ప్రభుత్వం ప్రవేశ పెట్టి నిరుపేదలకు సహాయం అందిస్తుందన్నారు. అందుకే కేసీఆర్ నాయకత్వంలో తామంతా సైనికుల్లా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. అందుకోసం రాష్ట్రంలోని మంత్రులు, ఎమ్మెల్సీలు, శాసనసభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు పనిచేస్తున్నారని అన్నారు. ఎందరికో సిఎం కెసిఆర్ భరోసా కల్పించారని మహిళలు జీవితాంతం సిఎం కెసిఆర్‌కు రుణపడి ఉంటారని అన్నారు. మహిళలను దృష్టిలో పెట్టుకొని టీఆర్ఎస్ ప్రభుత్వం ఏన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. గర్భిణులకు ఆరోగ్యలక్ష్మితో పాటు అమ్మ ఒడి పథకం ద్వారా ప్రభుత్వ దవాఖానలో ప్రసవాలు జరుపుకొన్న మహిళలకు నగదు ప్రోత్సాహంతో పాటు కేసీఆర్ కిట్‌ను అందజేస్తున్నామని తెలిపారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా పెళ్లి చేసుకొన్న తెల్ల రేషన్ కార్డు కలిగిన వారందరికి సాయం అందిస్తూ కేసీఆర్ పెద్దన్న పాత్రను పోషిస్తున్నారన్నారు. రాష్ట్రంలోని కుల వృత్తులకు ఆర్థిక సహాయం అందించి ఆదుకుంటున్నారని చెప్పారు. రైతులను ఆదుకునేందుకు ఎకరానికి రూ.5 వేల చొప్పున ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు. ఒక్కో క్లస్టర్‌కు ఏఈవోలను నియమించి వారి పరిధిలో రైతు భవనాలను నిర్మిస్తామని, రైతులు భూసార పరీక్షలు చేయించుకొని దాని ఆధారంగా పంటలు వేసుకోవాలని సూచించారు.

## ఐనవోలు జాతరకు ఏర్పాట్లు

వరంగల్,జనవరి11(ఆర్ఎన్ఎ): ఐనవోలు జాతరకు భారీగా ఏర్పాట్లు చేశారు. ఐనవోలు మల్లికార్జున స్వామి, కొత్తకొండ వీరభద్రస్వామి జాతరలు జరుగనున్నాయి. ఈ జాతరలకు ప్రత్యేక బస్సులను నడిపేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. హన్మకొండ బస్టాండ్‌లో ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడి నుంచి కొత్తకొండకు అదనపు సర్వీసులు నడపనున్నారు. ఇవి దేవాలయం సమీపానికి ప్రయాణికులను చేరవేస్తాయని అధికారులు పేర్కొన్నారు. ఐనవోలు మల్లన్న జాతరకు ప్రత్యేక బస్సులు నడిపేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇవి వరంగల్ బస్‌స్టేషన్ నుంచి భక్తులను చేరవేస్తాయన్నారు. ఐనవోలు జాతరలో మొక్కులు సమర్పించుకున్న భక్తులు కొమురవెల్లికి వెళ్లడానికి బస్సులు అందుబాటులో ఉంచుతామన్నారు.

## బిజెపి నేతలవి అసత్యపు మాటలు

### మతవిద్వేషాలు రెచ్చగొట్టి లబ్ది పొందాలన్న కుట్ర

### మండిపడ్డ మాజీ డిప్యూటి సిఎం కడియం శ్రీహరి

వరంగల్,జనవరి11(ఆర్ఎన్ఎ): బీజేపీ నాయకులు అసత్యపు మాటలతో, మత విద్వేషాలు రెచ్చగొట్టి వరంగల్ కార్పొరేషన్ ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్నారని ఎమ్మెల్సీ,మాజీ డిప్యూటి సిఎం కడియం శ్రీహరి అన్నారు.

వారి పర్యటనల్లో చేస్తున్న వ్యాఖ్యలు, మాట్లాడుతున్న తీరు చూస్తుంటే ఇది స్పష్టం అవుతుందని అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు చేసిందేమీ లేదన్నారు. దేవుళ్లు, ఆలయాల పేర్లు చెప్పి ఓట్లు పొందాలని బీజేపీ దద్దమ్మలు, సన్నాసులు చూస్తున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రశ్నించేతత్వం తెలంగాణ మట్టిలో ఉందన్నారు. సర్వమత సామరస్యానికి ప్రతీక తెలంగాణ అని కడియం శ్రీహరి పేర్కొన్నారు. ముందుగా తెలంగాణకు ఏం చేశారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. వరదలు వచ్చినప్పుడు, కరోనాతో ప్రజలు ఇబ్బందులు పడ్డప్పుడు రాని నాయకులు ఇప్పుడు వచ్చి మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారని ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్ భాస్కర్ మండిపడ్డారు. తొండిగాళ్లకు, తొడగొట్టే నాయకులకు మేం సమాధానం చెప్పాల్సిన అవసరం లేదన్నారు. ప్రజలకే మేము సమాధానం చెప్తామన్నారు. బీజేపీ నాయకులు రెచ్చగొడితే రెచ్చిపోమని వినయ్ భాస్కర్ పేర్కొన్నారు.

